కథానిక

# కలహాంతరితగా పార్వతి

కె. రామలక్ష్మి

పార్వతికీ కృష్ణమూర్తికీ—సాంసారిక జీవన నాటకంలో అత్యద్భుత ఘట్టం ఆడే సమయం వచ్చిందన్నమాటే — వివాహం అయి ఆరువారాలు దాటింది. ఆరువారాలలో అనేక యుద్ధాలు జరిగాయి. పార్వతి గెలిచింది. కృష్ణమూర్తి ఉదారస్వభావంతో పరాజయాన్ని అంగీకరించి వూరుకున్నాడు. అయినా యింత త్వరలోనే యిటువంటి ఘట్టానికి సమయం వచ్చేస్తుందని అనుకోలేదు కృష్ణమూర్తి. అయినా ఆ సమయం వచ్చింది. ఆ సమయాన్ని వృథాగా పోనివ్వదలుచుకోలేదు కృష్ణమూర్తి.

హడావుడిగా మనుషులూ కార్లూ, యితరమైన అనేక వాహనాలూ పయనించే ఆరోడ్డు ప్రక్కగా డ్రైవరు కారు ఆపుతూ, కృష్ణమూర్తితో ఏదో చెప్పాడు. కృష్ణమూర్తి జేబులోంచి ఐదు రూపాయిల కాగితం యిచ్చాడు. పార్వతి గ్రహించింది పెట్రోలు తాగడానికని. అవును మరి గమ్యం అంటూ ఏదీ లేకుండానే కొన్నివేల మైళ్ళు అదే పట్టణంలో తిరిగిందేమో ఆకారు! కారు దిగకుండా ఎంతదూరం రమ్మన్నా కృష్ణమూర్తికి అభ్యంతరం వుండదు. పార్వతికి యిది దారుణంగా తోస్తుంది; ఇంకెందుకేనా కర్చుపెట్టితే బాగుండే సొమ్ము అనవసరంగా కారు తాగేస్తూంది.

డ్రైవరు కారుని పెట్రోలు బంకుదగ్గిరకి నడిపించాడు. ముందు దరిదాపు అరడజను కార్లేనా వున్నాయి. పార్వతి అనుకుంది. యీ కార్లనిండా కృష్ణమూర్తిలేనా వుంట—అని. కారుదిగి పక్కనే వున్న బట్టలకొట్టు అద్దాల గూళ్ళు చూస్తోంది పార్వతి. కారు పెట్రోలు తాగేదాకా, కృష్ణమూర్తి వెనకసీట్లో హాయిగా జేరపడి సిగరెట్టు వెలిగించాడు. పార్వతి ఎంతో ఉత్సాహంతో అద్దాల గూళ్ళలో అందాల బొమ్మలకి కట్టిన జరీ చీరలనీ, చక్కని రవికెలనీ ప్రతి అలంకరణనీ చూస్తోంది. ఆబొమ్మ చేతిలో మడతగా ఒక చీర పెట్టివుంది. అప్పటిదాకా ఆబొమ్మ కట్టుకున్న చీరనే చూస్తూన్న పార్వతికి—ఆమడత చూడగానే ప్రాణం లేచివచ్చింది. ఆబొమ్మ కట్టుకొన్న చీర లాంటిదే ఆ మడతకూడా అవడం పార్వతి హాయికి కారణం. సంతోషంతో ఆమె ముఖం విప్పారింది. తనకి సరిగ్గా సరిపడే చీర యిన్నాళ్ళకి కళ్ళపడిం దనుకుంది. "అదంతా నిజమైన జరీ కాదేమో!"అనుకుంటూనే— "అయితేనేం? ఎంతందంగా వుందీ! అది కట్టుకుని నా పెట్టెలో ఉన్న కొత్తరవిక వేసుకుంటే ఎంతో చక్కగావుంటుంది" అని అనుకుంటూనే ఖరీదు కనుక్కోడానికి లోపలికి వెళ్ళింది పార్వతి. కారు వెనుకసీటులో కూర్చుని సిగరెట్టు కాలుస్తూన్న కృష్ణమూర్తి, పార్వతి లోపలికెళ్ళడం చూడకపోలేదు. అయినా చూడనట్టే వూరుకున్నాడు.

కొద్దినిముషాలలో పార్వతి చిరునవ్వులు కురిపిస్తూ కారుదగ్గిరకి వస్తూంది. కృష్ణమూర్తి తన సిగరెట్టుపొగమీదనే దృష్టిని కేంద్రీకరించాడు. రానున్న సంక్షోభం అతనికి తెలుస్తూనే వుంది—పార్వతి చిరునవ్వులు చూస్తే.

కృష్ణమూర్తిని సమ్మోహితుణ్ణిచేసేసే అమాయికపు చిరునవ్వు నవ్వుతూ, కృష్ణమూర్తిచేయిమీద చేయివేస్తూ అడిగింది పార్వతి— "ఓ పదహార్రూపాయిలు యిస్తావా తుండూ?"అని. ఆ రోజుల్లో పార్వతి కృష్ణమూర్తిని ముద్దుగా తుండూ అనేది. ఆరోజుల్లో పార్వతికి కృష్ణమూర్తి బానిస. విశాలమైన కళ్ళలో విశ్వాసం తొణికిసలాడుతూ, ఉత్తి తుండులాగే ప్రవర్తించేవాడు. ఆ రోజుల్లో పార్వతి తుండూ అని పిలిస్తే కృష్ణమూర్తి సంతోషించేవాడు.

కాని యీ ప్రస్తుతంలో కృష్ణమూర్తి — ఆ సమ్మోహనపరిచే అమాయకపు చిరునవ్వుకి కాని, వాత్సల్యపూరితమైన ఆమె ముద్దు పేరుకి.

కాని, తలబిగ్గ తలుచుకోలేదు. అంతే. అందుకే, పార్వతికేసి ప్రశాంతంగా చూడనైనా చూడలేదు.

"ఇంకో చీరమాత్రం కొనడం లేదుకదా?" అన్నాడు కృష్ణమూర్తి కఠినంగా సవాల్ చేస్తూన్నట్లు.

ప్రతిక్షణంలోనే పార్వతిముఖంలోని చిరునవ్వు మాయమైంది. గాలిలో అల్లల్లాడే ఆమెశరీరలత ఒక్కసారి బలం తెచ్చుకొని నిబ్బరంగా నిలబడింది.

"అవును, ఇంకోచీర కొనుక్కుందామనే." మోటుగా సమాధానంచెప్పింది.

యుద్ధానికి పిలుపుగా మ్రోగే జయభేరీలాంటి ఆ మాట, ఆ సమాధానం విన్న కృష్ణమూర్తి తనవీపు తనే తట్టుకున్నాడు సెభాష్ అని. అయినా రోజుల వారీగా కారుని అరువుతెచ్చే స్తోమతు వుండీ బాగా ధనార్జన చేస్తూకూడా కొత్తపెళ్ళానికి పదహారు రూపాయల చీరకొనడానికి ఎందుకు వెనుకతీస్తాడు? అంటే ఒకసంగతి గుర్తుంచుకోవాలి-యిక్కడ మనం ఆలోచించవలసినది డబ్బు విషయమే కాదు; ప్రిన్‌సిపల్ విషయం: క్రితంరాత్రే పార్వతీ కృష్ణమూర్తీ ఒక మారని నిర్ణయం చేసుకున్నారు; ఆరువారాలలోనూ పదిచీరలేనా కొన్న పార్వతి, కొంతకాలందాకా యిక చీరలమాట ఎత్తనంది. ఆరు వారాలుగా కారు పెట్రోలుకి రెండొందలుదాకా కర్చుపెట్టిన కృష్ణమూర్తి-యికమీదట కొన్నాళ్ళదాకా కారువిషయం తల పెట్టనని మాటయిచ్చాడు. మరి యీ క్షణంలో పార్వతిదేతప్పు. ఆ సంగతి పార్వతికి తెలుసు; కృష్ణమూర్తికీ తెలుసు. అయితేనేం? పార్వతికి ఆ చీర నచ్చింది; పార్వతికి ఆ చీర కావాలి.

వివాహంజరిగి పూర్తిగా మూడుమాసాలేనా కాకపోవటం - యీ ఘట్టాన్ని మరింత రసవత్తరం చేసింది. కృష్ణమూర్తికి తెలుసు—పార్వతి ఉత్త మొండిఘటం అని. అయినా తమయింటి ఆధిపత్యం ఎవరిచేత వుండాలోకూడా కృష్ణమూర్తికి తెలుసు. అందంగా నాజూకుగా వుండి, ప్రేమించి ప్రేమింపించుకో కలిగే అమ్మాయిని పెండ్లి చేసుకొన్నానని కృష్ణమూర్తికి తెలుసు; అంతే కాదు, తన పంతమే ఎప్పుడూ నెగ్గాలని కోరే అత్యాశాపరురాలనికూడా తెలుసు. అందుకే,తనకీ పరిపోయేటంతవరకూ ఆమె కనుసన్నల మెలిగే వాడు; కాని అవసరం వచ్చినప్పుడు ఎవరు ఇంటి యజమాని అన్న విషయంలో కృష్ణమూర్తిది ఒక అహంపూరితమైన దృష్టి. క్రితం రాత్రే యీసంగతి గుర్తుకి తెచ్చుకొని, అవకాశం వచ్చినప్పుడు వెన్నలా కరుగకుండా, పార్వతి ఎడల కఠినంగా ఉండి, తన పౌరుషాన్ని చాటుదామను కొన్నాడు...యీ క్షణంలోనే ఆ తలపోసిన అవకాశం వచ్చింది.

కాని యీ సమయంలో, హడావిడిగా మసిలే కార్లూ మనుషులూ అసంఖ్యాకంగా వున్న ఆ రోడ్డు వార పేవుమెంటుమీద వారి కళ్ళే దెబ్బలాడుకో గలిగాయి నిశ్శబ్దంగా; భయంకరంగా. నిజమే. నిజమైన ప్రేమ చేదు; చేదు.

పరిస్థితులను బాగా అవగాహన చేసుకొన్నాడు కృష్ణమూర్తి: సాంసారిక జీవితంలో శాంతి భద్రతలకి బాధ్యత తనదే—వయసులో పెద్దవాడు కాబట్టి. ఈక్షణంలో రోడ్డువారపేవుమెంటుమీద మూడు నెలల క్రితం వివాహం చేసుకొన్న భార్యాభర్తలు దెబ్బలాడుకోవడంలో ఇన్‌వాల్వ్ అయివున్న నైతిక పతనాన్ని గురించి ఆలోచించి చూశాడు; జీవితం అంటే ఏ మాత్రం అర్థంకాని పార్వతి అవివేకాన్ని గురించి ఆలోచించి చూశాడు; పార్వతి అందాన్నీ సమ్మోహనశక్తినీ ఆమెలోని అన్నిలోపాలనీ తలపోసి చూశాడు కృష్ణమూర్తి. వివాహం జరిగిన ఆరువారాలలోనూ, జరిగిన అనేక యుద్ధాలలోనూ, యింత ప్రాముఖ్యమైనది లేకపోవడంవల్లా, ఇదే అంత ప్రాముఖ్యం అయినది కావడంవల్లా, దీనిలోని జయాపజయాలు తమలో ఎటువంటి మానసికమైన మార్పులను తెస్తాయో కూడా వూహించిచూశాడు. ఈ విషయంలో పార్వతిది పైచేయి అయితే రాగల ఫలితాలు ఆలోచించి చూశాడు. అందుకే, యీ విషయంలో ఆమెని గెలిపించడం కృష్ణమూర్తిని సుతరామూ యిష్టంలేదు. అయినా, యిన్నాళ్లూ ఆమె మొండితనపు పరిమితి కృష్ణమూర్తికి అర్థం కాలేదు; తన కోరిక నెరవేర్చుకొందుకి సర్వస్వం త్యాగంచేసేస్తుంది పార్వతి: ఆఖరికి కృష్ణమూర్తిని కూడా. ఆ సంగతి తల్చుకొంటే పిరికితనం కల్గినా కృష్ణమూర్తి కృతనిశ్చయుడై పార్వతి ముఖంవంక తీక్షణంగా చూశాడు. కొందరాడవాళ్ళువుంటారు:

తమకవసరం అయినంతవరకూ ఎంతైనా సున్నితంగా ప్రవర్తిస్తారు; తరువాత? కృష్ణమూర్తికి తెలుసు—పార్వతి యీ కోవకిచెందినదేనని.

పార్వతి రెండేవిషయాలపై తన దృష్టిని కేంద్రీకరించింది: షాపులో అద్దాలగూడులోని అమ్మాయి చేతిలో చీరమీద; కృష్ణమూర్తి కోటుజేబులో అనేక అరలమధ్య దాగివున్న పదిరూపాయల నోట్లమీద.

"చూడు పారూ, యిప్పటికి పదిచీరలైనా కొన్నావు—గత ఆరువారాలలో."

"ఓ పదహారు రూపాయలు అప్పుయిస్తావా?" పార్వతి, గాజు కంఠంతో అడిగింది. చీరని ఎలాగేనా కొనాలనే పిచ్చికోరిక ఆమెని ఆవహించింది. కొద్ది క్షణాల క్రితం, సంతోషంతో కృష్ణమూర్తిపట్ల పొంగిపొరలే ప్రేమతో నిండిన పార్వతికాదు యీక్షణాన పదహారు రూపాయలు కావాలని నిలదీసి అడుగుతున్న పార్వతి. ఆమె ప్రస్తుతం ప్రేమించి ప్రేమించబడే ప్రేయసికాదు; చెప్పినమాట జవదాటని భార్యాకాదు; ఆలోచించి అర్థవంతంగా ప్రవర్తించే యేప్రాణీకాదు; మూర్తీభవించిన "చీరల కోరిక" ఆమె. ఆడవాళ్ళ అత్యాశకి నిదర్శన.

తన కోపాన్ని అణచుకుంటూ కృష్ణమూర్తి అన్నాడు "నిన్న రాత్రే మనం ఒక నిర్ణనికివచ్చాం జ్ఞాపకం తెచ్చుకో పార్వతీ."

'నాకో పదహారు రూపాయలు అప్పుయిస్తావా' తిరిగి అడిగింది పార్వతి. కారుడ్రైవరు కారు తలుపు తెరుస్తున్నాడు. కృష్ణమూర్తికి సిగ్గువేసింది. ఏమిటీ పార్వతీ! పైవాళ్లు ఉన్నప్పుడేనా కొంచం నెమ్మదిగా మాట్లాడకూడదూ? ఇంక ఏం అనకుండా కృష్ణమూర్తి పర్సుతీసి రెండు పదిరూపాయల నోట్లు యిచ్చాడు! థాంక్సు చెప్పకుండానే పార్వతి షాపువైపు వెళ్ళింది. అదిచూసి, తనఉరికి తనే తాడు బిగించుకొన్నట్లు బాధపడ్డాడు కృష్ణమూర్తి. పెట్రోలు పోసుకొని పార్వతి రాకకై కారు ఎదురుచూస్తూంది. చిన్న పాకెట్టు చేతిలో పెట్టుకొని, చిరునవ్వు ముఖంతో పార్వతి వచ్చింది. ఏం మాట్లాడకుండానే కారు ఎక్కి కృష్ణమూర్తి పక్కగా కూర్చుంది. ఇంటికిపోయి, తానా చీర కట్టుకొని కృష్ణమూర్తి ఎదుటికివస్తే. అతని కోపం అంతా యిట్టే పోతుందని పార్వతి ధైర్యం.

ఇంటికి రాగానే పార్వతి కొత్తచీర కట్టుకొంది. జరీ అయినా కాకున్నా చీర ఎంతో అందంగా వుంది, పడకకుర్చీలో పడుకుని పేపరు చూస్తున్న కృష్ణమూర్తి దగ్గరకివచ్చి చిన్న నవ్వు ముఖంతో నించుంది; కృష్ణమూర్తి చూశాడు. చీర కొనడం విషయంలో జరిగిన రభస సంగతి ఎలావున్నా ఆ చీరలో పార్వతి బాగున్నది, పార్వతిని దగ్గరికి తీసుకొన్నాడు.

"చీర చాలా బాగుంది పార్వతీ" అన్నాడు.

"చూశావా? కొనుక్కుంటానంటే ఎంత ఫస్ చేశావో" అన్నట్లు చూస్తూ, అతని తల సవరించింది పార్వతి. ఆ క్షణంలో పార్వతి హృదయం గర్వంతో తొణికిసలాడింది. మగవాడిని ఎలాగ మేనేజ్ చేయాలో తనకు తెలుసుననీ, సమ్మోహనపరుస్తూ, మొండితనంప్రదర్శిస్తే ఏ పురుషుడైనా తలఒగ్గవలసిందేననీ పార్వతికి నమ్మకం కల్గింది. వెనుక ముందులాడడం, సగంసగంగా కోరిక తెలుపడం లాంటివి ఏం లాభంలేదు. అలా చెయ్యలేదు కనుకనే తను నెగ్గింది. అందమైన మైదానంలా ఆమె భావిజీవితం కనులముందు కదలాడింది. కృష్ణమూర్తి తన కోరికలకి బానిస; కళ్లెం బిగించి తన కోరికల గుర్రాలని అదలించితే; అవసరం అనుకొన్నప్పుడు కృష్ణమూర్తిని తగినట్లు సమ్మోహనపరిస్తే... పార్వతి ఆనందానికి అవధుల్లేవు... ఆ ఆలోచనల ఫలితంగా పార్వతి కృష్ణమూర్తిని కౌగలించుకొంది. కృష్ణమూర్తి ఆమె కొత్తచీరని యింకా పొగిడాడు.

రాత్రి భోజనాలు అయాక, కృష్ణమూర్తి డ్రైవరుతో మాట్లాడుతున్నాడు. పార్వతి హృదయం సంగీతం పాడింది—రేపూ—మళ్ళీ రేపూ—యీ ఉదయంలాగే—అందుకే రేపురమ్మని చెప్తున్నట్లున్నాడు—అని అనుకుంది పార్వతి. కాని కృష్ణమూర్తి—పొద్దుట తనకి రెండుపదులు యివ్వడానికి ఎంతో గొడవచేసిన కృష్ణమూర్తి—రెండు పదిరూపాయలనోట్లు బలవంతాన డ్రైవరు చేతిలో పెట్టడంకూడా చూసింది. ఎందుకుచెప్మా అని ఆలోచించింది. ఆమె వూహాలకి ఏదీ అందలేదు.

అయినా కృష్ణవచ్చి చెప్పకపోతాడా అని వూరుకొంది.

రెండురోజులు గడిచాయి. పార్వతి మళ్ళీ ప్రయాణం కాలేదు; కృష్ణమూర్తి వెడదామనీ అనలేదు. పార్వతికి డ్రైవరుచేతిలో రెండు పది రూపాయలనోట్లూ జ్ఞాపకంవచ్చినప్పుడల్లా కృష్ణమూర్తిమీద కోపంవస్తూంది. అయినా ఎందుకిచ్చావని అడిగేందుకి యిష్టంలేకపోయింది.

ఆ రోజు ఆదివారం. హాల్లో కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు కృష్ణమూర్తి. ఆ నాటి కొత్తచీర కట్టుకొని పార్వతి పక్కనే కూర్చుని ఏదో నవల చదువుతూంది. ఇంతట్లో లోపలినుంచి నూకాలు వచ్చింది.

"అమ్మా నా కూతురొచ్చింది. అది పదకొండు గంటల బండిలో మొగుడితో వెళ్ళిపోతుంది. అయ్యగారు చీర కొని పెట్టారు—కట్టుకొచ్చింది—చూపెట్టడానికి." చెప్పుకొని పోతుంది నూకాలు.

"రమ్మను నూకాలూ, నా ముందు రాడానికి లచ్చికి అంత సిగ్గెందుకూ?"అన్నాడు కృష్ణమూర్తి. తనకి తెలియకుండా దాసీదాని కుమార్తెకి చీరకొని పెట్టాడని వినగానే పార్వతి ముఖం కోపంతో ఎర్రబడింది. ఎంత దారుణం? యీ రోజు చీర కొన్నాడు. రేపు నగలు చేయిస్తాడు! అసూయలో పార్వతి మనస్సు కల్లోలం అయింది. లచ్చివచ్చి వెళ్ళాక కృష్ణమూర్తిని గట్టిగా అడగాలని నిశ్చయించు కొంది.

సిగ్గుతో తలదించేసుకొని నూకాలు వెనక లచ్చి వచ్చింది. పార్వతికళ్లు ఆశ్చర్యంతో పెద్దవయాయి. తను—కోరికోరి కృష్ణమూర్తితో తగవులాడి కొనుక్కొన్న పదహారు రూపాయిల చీరలాంటిదే నూకాలు కూతురు లచ్చి కట్టుకొంది. కృష్ణమూర్తి కుర్చీలోంచి లేచి తన పడగ్గదిలోకి వెళ్ళిపోయాడు. పార్వతి కోపంతో ఒణికిపోయింది. కాని ఏంచేస్తుంది?

"బాగుంది లచ్చీ, చీర ఎవరు తెచ్చారు?" ఎంతో ఆప్యాయంగా అడిగింది పార్వతి.

"అయ్యగారు దాని మెగుడికి డబ్బులిచ్చారమ్మా. సరిగ్గా వాడూ చక్కటి చీర తెచ్చాడు" అంటూ చెప్పింది నూకాలు.

"డ్రైవరు నీ అల్లుడా! చెప్పావు కాదేం?" అడిగింది పార్వతి.

"తెలుసు ననుకొన్నానమ్మా." అందినూకాలు తప్పుచేసినట్లు బాధపడుతూ.

"పరవాలేదు నూకాలూ, పోయిరా లచ్చీ! హాయిగా వుండు"అనేసి లోపలికి వెళ్ళింది పార్వతి. గదిలో కృష్ణమూర్తికోసం కలియచూసింది, కత్తి చేతపుచ్చుకున్నట్లు. పడకగదిలో కుర్చీలోకూర్చుని ప్రశాంతంగా సిగరెట్టుకాలుస్తున్న కృష్ణమూర్తిని చూడలేదు పార్వతి. దభాలున తలుపుమూసి మంచంమీద కూర్చుండిపోయింది. పార్వతికి దుఃఖం పొంగిపొరలివచ్చింది. యింతగా అవమానిస్తాడని, కృష్ణమూర్తి హృదయంలో యింత ప్రతీకార కాంక్షకి చోటుందనీ పార్వతి ఎప్పుడూ వూహించనైనాలేదు.

"ఏం పారూ!" అంటూ చిరునవ్వుతో పలకరించాడు కృష్ణమూర్తి. యింతదాకా ఒంటరిగా వున్నాననుకొన్న పార్వతి ఈ పిలుపు విని ఉలిక్కిపడింది. మరుక్షణమే, కట్టలు తెగిన దుఃఖంతో మంచంమీద పడి ఏడ్వడం మొదలుపెట్టింది. తను మూర్ఖంగా ప్రవర్తించాడా? పాపం, పార్వతి యింతగా గాయపడిందా? అన్న వూహాలతో మైనం లాగా కరిగిపోయిన హృదయంతో, పార్వతియెడల ద్విగుణీకృతం అయిన ప్రేమతో, పార్వతిదగ్గిరికి వచ్చి, తన కౌగిలిలోకి చేర్చుకున్నాడు ఆమెని. దుఃఖం మధ్య ఏదేదో మాట్లాడుతూ పార్వతి అంది——

"కృష్ణమూర్తీ! నువ్వు అసహ్యమైన, క్రూరమైన జంతువ్వి."

"అవును పారూ! నాకు తెలుసు; కాని చాలా రోజులక్రిందటే ఆ సంగతి నువ్వు గుర్తించావనుకున్నాను"అన్నాడు, పార్వతి రేగిన ముంగురులు సవరిస్తూ.

"నువ్విలా చేస్తావని అనుకోలేదు. ఇక నిన్ను ప్రేమించలేను, ప్రేమించను. మన జీవితంలో అన్నీ అయిపోయాయి" అంటూ దుఃఖంతో పూడుకుపోయిన గొంతుకతో ఏమేమో పార్వతి అంటూంటే, కృష్ణమూర్తి ఆమెని ముద్దుపెట్టుకొన్నాడు. ఆమె వెక్కివెక్కి ఏడుస్తూనే, అతని కంఠాన్ని కౌగలించుకొంది. ★